# విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

సోమవారం 23 డిసెంబర్ 2024 | 8 పేజీలు


# మేము వస్తున్నాం జాగ్రత్త

- వైన్ షాప్ నిర్వాహకులను ప్రోత్సహిస్తున్న అధికారులు
- బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు
- పేరుకే బడ్డీ కొట్టు...అమ్మేది మద్యం
- పచ్చటి సంసారాలలో చిచ్చు పెడుతున్న మద్యం
- అంతా అధికారుల కనుసన్నల్లోనే..
- తూతూమంత్రంగా దాడులు

**విశాలాంధ్ర-పీసీపల్లి :**
కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి సుమారు ఆరు నెలలపైనే అవుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ వైన్స్ షాపులకు అనుమతించింది. దీంతో పీసీపల్లి మండలంలో బెల్ట్ షాపుల దందా ‘మూడు బాటిళ్లు.. ఆరు కాసులు’గా తయారైంది. ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా గల్లిగల్లికో బెల్ట్ షాపు ఏర్పాటు చేస్తోంది. మంచినీళ్ల దొరకని షాపులు ఉన్నాయంటే అతిశయోక్తికాదు గానీ, మద్యం దొరకని చోటంటూ లేకపోవడం గమనార్హం. నివాస గృహాలు చిన్న చిన్న కిరాణా షాపుల్లోనూ కావలసినంత మద్యం దొరుకుతోంది. వైన్, బార్ షాపుల్లో సమయసారిణి ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలు అందుబాటులో ఉంటోంది. సామాన్యులు పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. ఇదే సమయంలో అన్ని ప్రాంతాల్లో గ్రామాలలో వాడవాడల మద్యం బెల్టు షాపులు కూడా వెలిశాయి. గతంలో ప్రభుత్వ వైన్స్ కావడం.. డిమాండ్ ఉన్న బ్రాండ్లు అందుబాటులో లేక పోవడంతో బెల్ట్ షాపులపై పెద్దగా ఎవరూ దృష్టి

మిగతా 2 లో ...

## ప్రతి గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేద్దాం

- 26న సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం
- 30న చీరాలలో భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ వెల్లడి

**విశాలాంధ్ర - బాపట్ల :** కార్మిక కర్షక శ్రామిక వర్గాల పక్షాన నిరంతరం పోరాటాలు ఉద్యమాలు చేస్తూ హక్కుల సాధన లక్ష్యంగా పనిచేస్తున్న సీపీఐ శతజయంతి ఉత్సవాలను జిల్లాలో గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించ నున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఆదివారం సింగరకొండ మీడియాతో మాట్లాడుతూ సీపీఐ 99 ఏళ్లగా కార్మిక కర్షక శ్రామికుల గొంతుకగా సమాజంలో శ్రమ దోపిడీ గురవుతున్న కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఘన చరిత్ర సీపీఐకే సొంతమన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను బాపట్ల జిల్లాలో ఈనెల 26 నుంచి ఘనంగా నిర్వహించేందుకు సీపీఐ జిల్లా నియోజక వర్గ, మండల, గ్రామ శాఖలు సన్నద్ధం కావాలని

మిగతా 2 లో ...

## హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

5లో

## 31న అన్లాక్ 2025 వేడుకలు

### వేడుకల బ్రోచరు ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల

**విశాలాంధ్ర-ఒంగోలు :** హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలల్లో 31 రాత్రి జరిగే ఈవెంట్ వేడుకలకు దీటుగా ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారి ఒంగోలులో ప్రైడ్ మీడియా ఆధ్వర్యంలో అన్లాక్ 2025 సంబరాల ఈవెంట్ వేడుకలు నగరంలోని అర్జున్ ఇన్ఫ్రాలో ఈ నెల 31 సాయంత్రం గ్రాండ్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ప్రముఖ సింగర్ యశస్వి తెలిపారు. ఒంగోలు నగరంలో అర్జున్ ఇన్ఫ్రాలో ప్రైడ్ మీడియా వారు నిర్వహిస్తున్న అన్లాక్ 2025 ఈవెంట్‌కి సంబంధించిన టికెట్ లాంచింగ్ కార్యక్రమం వై.ప్యాలెస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ప్రముఖ సింగర్ యశస్వి మరియు అర్జున్ ఇన్ఫ్రా ఎండి బొమ్మిశెట్టి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో గత 10 సంవత్సరాల నుండి ప్రైడ్ మీడియా యాజమాన్యం గోరంట్ల వెంకటేష్ అనేక కార్యక్రమాలు చేస్తూ ప్రజలలో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఇంత పెద్ద ఈవెంట్ ప్రైడ్ మీడియా ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని నా నియోజకవర్గంలో ఇలాంటి ఈవెంట్

మిగతా 2 లో ...

## కమాండ్ కంట్రోల్‌తో నేరాల నియంత్రణ

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తం
- సౌత్ కోస్టల్ రేంజి ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి

**విశాలాంధ్ర - చీరాల :**
కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వలన నేరాలను నియంత్రించవచ్చని సౌత్ కోస్టల్ రేంజ్ డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. ఆదివారం చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వ శ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ సాధారణ తనిఖీలలో భాగంగా చీరాల ఒకటవ పట్టణపోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేయటం జరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి, శాంతి భద్రత పరిరక్షణ, పెండింగ్ కేసులు త్వరితగతిన చేధించడం గురించి, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయు విధానం గురించి పోలీస్ అధికారులతో చర్చించి అనేక సూచనలు చేశామని, ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాట్సప్ ద్వారా కాల్స్ చేసి కస్టమ్స్, సిఐడి, విజిలెన్స్ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులమని బెదిరింపులు వచ్చినప్పుడు మనోధైర్యం కోల్పోకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఒకవేళ ఏదైనా సైబర్ మోసం వలన డబ్బులు కోల్పోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ నేర నియంత్రణ కొరకు కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయటం వలన మెరుగైన సేవలను ప్రజలకు అందించవచ్చునని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఐజి త్రిపాఠి చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్, రామాపురం బీచ్ ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించడం జరిగిందన్నారు. చీరాల పట్టణ, రూరల్, సముద్ర తీర ప్రాంతాలలో విస్తృతంగా సీసీ కెమెరాలను, మైకులను ఏర్పాటు చేసి వాటన్నిటినీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అనుమానాస్పద పరిస్థితులు ఉంటే మైక్ ద్వారా స్థానిక విధుల్లో ఉన్న సిబ్బందిని (లేక) ప్రజలను అప్రమత్త చేయడానికి అవకాశం ఉంటుందని ఈ విషయం గురించి ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి చర్చించినట్లు త్వరలోనే దీని కార్యాచరణకు ముందడుగులు వేస్తామని తెలిపారు. చీరాల డీఎస్పీ మోయిన్, రెండవ పట్టణ సీఐ భూషణం, రూరల్ సీఐ శేషగిరిరావు, స్థానిక ఎస్సైలు పాల్గొన్నారు.

## రాళ్లపల్లిలో మెగా క్రికెట్ టోర్నమెంట్

### ప్రథమ బహుమతికి రూ.20వేలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : రాళ్లపల్లి గ్రామం నందు మండల తెలుగు రైతు అధ్యక్షులు మినిగ కాశయ్య ఆధ్వర్యంలో మెగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌కి మండలం నుండి భారీగా క్రికెట్ టీంలు పాల్గొననున్నాయి. గెలుపొందిన వారికి నూతన సంవత్సరం పురస్కరించుకొని మొదటి బహుమతి కనిగిరి నియోజక వర్గం టిడిపి నాయకులు శ్యామల కాశిరెడ్డి 20 వేల రూపాయలు, రెండో బహుమతి కురవరపు అనూక్ 15000 ఇవ్వనున్నారు. చివరి రోజు భోజన ఏర్పాట్లను మండల తెలుగు రైతు అధ్యక్షులు మినిగ కాశయ్య అందివ్వనున్నారు. ఈ క్రమంలో ఆటను దగ్గరుండి ఆయన పర్యవేక్షించనున్నారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి ఆటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులు తగరం రాజారత్నం, శికామణి, ప్రభాకర్, కొండయ్య, కొండే పోగు చిన్నయ్య, మేడబోయిన గురవయ్య, తగరం ఏసు, తగరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తిలోని చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియం నందు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘు కిరణ్ చేతుల మీదుగా 90 వేల రూపాయలు విలువచేసే పది కుట్టు మిషన్లను నిరుపేద మహిళలకు ఆదివారం పంపిణీ చేయడం జరిగింది. రఘు కిరణ్ మాట్లాడుతూ మహిళల జీవనోపాధికి కుట్టు మిషన్లు దోహదపడతాయని వారు కొంత ఆర్థిక అభివృద్ధి చెందడానికి ఉప యోగపడతాయని అన్నారు. రోటరీ ఇక్కడ అధ్యక్షులు కడవా రామకృష్ణ, సెక్రటరీ కందుకూరి వెంకట సుధాకర్, మాజీ అధ్యక్షులు కార్యదర్శులు పోకూరి తిరు వెంగళం,పోకూరి రామకృష్ణారెడ్డి, అంబటి వీరారెడ్డి, రోటరీ మిత్రులు నాగేళ్ళ సత్యం,దొంతు సోమయ్య పాల్గొన్నారు.

## ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహణ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి గౌతమి డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించడం జరిగింది.ఈ పరీక్షను 350 మంది విద్యార్థులు హాజరైనట్లు చీమకుర్తి మండల యూటీఎఫ్ అధ్యక్షులు షేక్ అక్బర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చలువాది శ్రీని వాసరావు, ఎన్.పి.వెంకటేశ్వర్లు, కరిముల్లా, అమరా మురళి, ఎస్.ఎఫ్.ఐ. నుండి మండల అధ్యక్షులు దేవరాజు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో సీపీఐ జెండా ఎగురవేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన అద్దంకి నియోజకవర్గంలో ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొన్నట్లు తెలిపారు. 27వ తేదీన బాపట్ల నియోజకవర్గంలో, 28వ తేదీన రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. 30వ తేదీన చీరాల నియోజక వర్గంలో శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా చీరాల పట్టణంలో భారీ ప్రదర్శన భారీ బహిరంగ సభ జరుగుతుందని సింగర కొండ తెలిపారు. భారీ బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.ముగింపు సభను విజయవంతం చేయటానికి జిల్లాలోని కార్యవర్గం అంత ఉత్సాహంగా పాల్గొనాలని సింగరకొండ కోరారు.

# కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి నా లక్ష్యం

- వెలిగొండ ప్రాజెక్టును మోపాడుకు అనుసంధానం చేస్తాం
- రైతు సంక్షేమానికి రిజర్వాయర్ పాలకవర్గంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తున్నానని, వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మోపాడు రిజర్వాయర్‌ను వెలిగొండ ప్రాజెక్టుకు అనుసంధానం చేసి ఈ ప్రాంతం క్షామ పీడిత నివారణ చర్యలుకు కృషి చేస్తానని, నింజ్జ్, ట్రిబుల్ ఐటీ, రైల్వే, రోడ్లు, సాగునీరు, తాగునీరు కు కావలసిన నిధులు కోసం ప్రణాళికలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేయడం జరిగిందని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి అన్నారు. మోపాడు బంగ్లా వద్ద రిజర్వాయర్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. పరిశీలకులుగా గంగోడ నాగేశ్వరరావు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికైన రిజర్వాయర్ పాలకవర్గం రైతు సంక్షేమానికి కృషి చేయాలన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించే చర్యలు చేపట్టి రైతులకు అండగా నిలవాలి అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే బాధ్యతలు తీసుకుంటుందన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ లు చుంచు కొండయ్య, మోరబోయిన నరసింహ యాదవ్ లు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో అప్పగించిన పదవులకు న్యాయం చేస్తామని, శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో రిజర్వాయర్ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, రైతుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఈ విజయ భాస్కర్, ఏఈ ప్రసాద్, పీసీ పల్లి పల్లె టిడిపి మండల అధ్యక్షులు వేమూరి రామయ్య, మండల టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అదుసుమల్లి ప్రభాకర చౌదరి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, మాజీ జెడ్పిటిసి హుస్సేన్ రావు యాదవ్, పచ్చా పేరయ్య, దేవరపు మాల్యాద్రి, కొలారి కాజారాంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## 31న అన్లాక్ 2025 వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి నాకు మంచి పేరు తీసుకొని వస్తున్నా ఫ్రైడ్ మీడియా యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సరికొత్త ఈవెంట్స్ నిర్వహిస్తున్న ఫ్రైడ్ మీడియా యాజమాన్యానికి నా సపోర్ట్ ఎప్పుడు ఉంటుందన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ గోరంట్ల వెంకటేష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పెద్ద ఎత్తున సరికొత్తగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఈవెంట్ కు ప్రముఖ సింగర్ యశస్వి తన సొంత లైవ్ బ్యాండ్ తో పాల్గొంటారన్నారు.ఒంగోలు ప్రజలను దృష్టిలో పెట్టుకొని తక్కువ ధరకు వినోదం అందిస్తున్నామని, రకరకాల ఫుడ్ తోపాటు, బేవరేజెస్ డ్రింక్ కూడా అందిస్తున్నామని తెలిపారు. అన్‌లాక్-2025 ఈవెంట్‌కు అర్జున్ ఇన్ఫ్రా ఫుల్ సపోర్ట్ ఇస్తుందన్నారు. 31 జరిగే న్యూ ఇయర్ వేడుకలు ఒంగోలు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. అర్జున్ ఇన్ఫ్రా ఎండి బొమ్మిశెట్టి శంకర్ మాట్లాడుతూ ఫ్రైడ్ మీడియా వారు నిర్వహిస్తున్న నూతన సంవత్సర వేడుకలు అర్జున్ ఇన్ఫ్రా లో నిర్వహించడం మాకు చాల సంతోషంగా ఉందన్నారు. అన్లాక్ 2025 టికెట్ లాంచింగ్ కార్యక్రమంలో సాయి బాబ టైల్స్ ఎండి సాయి కృష్ణ, ఎవోక్ స్టైల్ క్లబ్ ఎండి అన్నపూర్ణ అల్లురయ్య, సితార హస్పిటల్స్ ఎండి సాయి చరణ్, శ్రీ విష్ణు యమహ ఎండి విష్ణు, స్నేహ ఎలక్ట్రానిక్స్ ఎండి హేమంత్, మేఘన మెడికల్స్ ఎండి రఘురామిరెడ్డి, జాయ్ ఫెర్టిలిటీ ఎండి నోయెల్ జాన్, కోటీస్ షాపింగ్ మాల్ ఎండి సూర్య నారాయణ, వి.డెంటిస్ట్ ఎండి హనుమంత రావు, కేటి స్మార్ట్ హోం ఎండి, వై ప్యాలెస్ ఎండి, ఏకే ఫోటోగ్రాఫి ఎండి సాయి, రవి వాటర్ సొల్యూషన్స్ ఎండి రవి పాల్గొన్నారు.

## మేము వస్తున్నాం...జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

సారించలేదు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వైన్స నిర్వహిస్తుండటం.. వారి ద్వారా కావాల్సినంత మద్యం, కోరిన బ్రాండ్లు దొరుకుతుండటంతో బెల్ట్‌షాపుల యథేచ్ఛగా వెలిశాయి. వైన్స లైసెన్స్ దారులతో సిండికేటైన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్ట్‌షాపులను నిర్వహి స్తున్నారు. ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల అండ ఉండటం కొన్ని దగ్గర్ల వారి అనుచరులే దుకాణాల నిర్వహిస్తుండటంతో వీటిని అడ్డుకునే వారే లేకుండా పోయారు. కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపుల బెడదతను తట్టుకోలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. ప్రతి గ్రామంలోనూ పది నుంచి 15 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. బెల్టు ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందని గ్రహించిన మద్యం వ్యాపారులు కూడా వాటిని ప్రోత్సహిస్తున్నారు. బెల్టు నిర్వహించుకునే వారి నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్ల క్రమంలో కొన్ని గ్రామాల్లో నేతలు, మద్యం వ్యాపారుల మధ్య వివాదాలు కూడా జరిగినట్లు సమాచారం.

**వైన్ షాపులకు అనుబంధంగా :**

మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండడంతో వైన్‌షాపుల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయంటే అతి శయోక్తి కాదు. తమ టార్గెట్లు చేరుకోనేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాపుల నిర్వాహకులే ప్రోత్సహి స్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్‌పై 40 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా ప్రతి వాడలో కనీసం 10 వరకు బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. బెల్టు షాపుల కారణంగా గ్రామాల్లోని వైన్ షాపుల్లో కూడా గణనీయంగా మద్యం అమ్మకాలు నమోదవు తున్నాయి. పట్టణాల్లో ఒక్కో వైన్ షాపులో సగటున రోజు 5 లక్షల రూపాయల వరకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**అక్రమంగా సిట్టింగ్‌లు :**

బెల్ట్ షాపుల్లో అక్రమంగా సిట్టింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తూ మందు బాబులను ఆకట్టు కుంటున్నారు. రెస్టారెంట్ మాదిరిగా అప్పటికప్పుడు ఆహార పదార్థాలు తయారు చేస్తూ నిర్వాహకులు అందజేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరిగా బెల్ట్ షాపుల్లో చికెన్, మటన్, గుడ్లు, ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను అందుబాటులో పెడుతున్నారు. విచ్చల విడిగా బెల్ట్ షాపులు, వైన్ షాపుల్లో సిట్టింగ్ కారణంగా బార్ అండ్ రెస్టారెంట్లలో గిరాకీలు పడిపోయాయి. దీంతో కోట్ల రూపాయలు ఫీజులు చెల్లిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటు చేస్తున్న బార్లకు నష్టం వాటిల్లుతుందని యజమానులు వాపోతున్నారు. వైన్ షాపుల్లో ఎక్కడ చూసినా అమ్మకాలు రోజురోజుకూ పెరుగుతుండగా, బార్‌లలో విక్రయాలు క్రమంగా పడిపోతున్నాయి.

**మేము వస్తున్నాం జర జాగ్రత్త...**

**ఎక్సైజ్ శాఖ చర్యలు శూన్యం :**

విచ్చల విడిగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు కొనసాగుతుండగా ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంతటితో ఆగకుండా పలు పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు ఆయా శాఖ అధికారులు ముందుగానే వైన్ షాప్ నిర్వాహకులకు మేము వస్తున్నాం మీరు జాగ్రత్తగా ఉండండి సరుకు కానరాకుండా జాగ్రత్తలు పడండి అంటూ వైన్ షాప్ నిర్వాహకులకు ముందుగానే తెలియజేస్తున్నడంతో వెంటనే అలర్ట్ అవుతున్న వైన్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాప్ నిర్వాహకులను అప్రమత్తం చేసి ఆయా శాఖ అధికారులు తనిఖీలకు వచ్చేసరికి ఎక్కడకక్కడ అప్రమత్తమవుతుండడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలకు వచ్చి ఏమీ లేవంటూ చేతులు తెలుపుకుంటున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతోనే అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలు న్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల భారిన పడే ప్రమాదం ఉంది. అయినా సరే అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పైగా వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి నెలవారీ మామూళ్లు అందుకుంటున్నారని బహిరంగ ప్రచారం జరుగు తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వైన్ షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మహిళలు వేడుకుంటున్నారు.

# సేవారంగంలో ముందుండాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
- ఘనంగా కాకతీయ సేవా సమితి బాలికల హాస్టల్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఒంగోలు : కమ్మవారు సేవా రంగంలో ముందుండాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఒంగోలులోని కొత్త మామిడిపాలెంలో నూతనంగా నిర్మించనున్న బాలికల హాస్టల్ గృహ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పురందేశ్వరి ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకతీయ సేవా సమితి కేవలం కమ్మవారి అభ్యున్నతి కె కాకుండా ఇతర కులాలలోని పేదవారికి కూడా చేయూత అందించడం శు భపరిణామం అన్నారు. ఈపాటికే పలువురు పేట విద్యార్థులకు స్కాలర్షిప్ ఇచ్చి సేవా రంగంలో ముందున్నారని అభినందించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ఐక్యంగా నిలబడితే ఇటువంటి సమస్యనైనా త్వరగా తిన పరిష్కరించుకోవచ్చని సూచించారు. కమ్మవారంతా ఒకే తాటిపైకి వచ్చి సేవారంగంలో నిలవాలని హితవు పలికారు. పేదల అభ్యున్నతి తాను ఎప్పుడూ ముందు నిలుస్తానని పేర్కొన్నారు. బాలికల హాస్టల్ నిర్మాణం కోసం భగీరథ కెమికల్స్ యాజమాన్యం స్థలం ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కాకతీయ సేవా సమితి జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు, శ్రీ ప్రతిభ విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ హర్షిని విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, మాజీ ఒంగోలు ఏఎంసి చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, కాకతీయ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. భారతీయం సత్యవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమాచార్య కీర్తనల బృందావనం ఆకట్టుకుంది.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని మహమ్మదాపురం పాఠశాల నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాతం శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, దద్దాల శ్రీనివాసులు, నాగమణి, ఇతర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలను సుందరంగా అలంకరించి విద్యార్థిని విద్యార్థులను తయారుచేసిన గణిత ప్రాజెక్టులను ప్రదర్శించడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులతో పాటు పాఠశాల సిబ్బందికి మధ్యాహ్నం భోజనం అందించడం జరిగింది.అలానే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు గణిత ఉపాధ్యాయులు గణితంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని తద్వారా జీవితంలో సుస్థిర స్థాయికి చేరుకోవచ్చని తెలియజేయడం జరిగింది. అనంతరం విద్యార్థిని విద్యార్థులు గణితానికి సంబంధించి వివిధ నృత్య రూపకాలను ప్రదర్శించడం జరిగింది.విద్యార్థిని విద్యార్థులకు వ్యాచరచన వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేయడం జరిగింది.

# క్రీస్తు బోధనలు ఆచరణీయం

**ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు**

విశాలాంధ్ర-ఒంగోలు : లోక రక్షకుడు యేసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఉమ్మడి ప్రకాశం జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్య లో శనివారం రాత్రి నగరంలోని పేస్ ఎన్ఆర్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సంఘం అధ్యక్షులు గెరే అజయ్ బాబు అధ్యక్షత జరిగిన ఈ వేడుకల్లో డా.జాలాది మణిబాబు వాఖ్య పరిచయ చేశారు. జనసేన నగర అధ్యక్షులు, కార్పొరేటర్ మలగా రమేష్, కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జ్ శ్రీపతి సతీష్, ప్రముఖ వైద్యులు డా. జీవన్, విద్యుత్ శాఖ అధికారి సుధీర్ బాబు, ఎంఎంఆర్ ఫౌండేషన్ అధినేత మక్కెన థామస్, సినీ డైరెక్టర్ సురేష్ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా. మణిబాబు క్రీస్తు పుట్టుక గురించి వాఖ్య పరిచయ చేశారు. షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని వివరించారు. క్రీస్తు బోధనలు ప్రపంచవాళి మార్పుకు ఎంతో దోహదపడ్డాయన్నారు. కార్పొరేటర్ మలగా రమేష్, డా. జీవన్, శ్రీప్రతి సతీష్ లు క్రైస్తవ సమాజానికి క్రిస్మస్ పండుగ కు భాకాంక్షలను తెలియజేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ను కట్ చేశారు. సంఘం ప్రతినిధులు వేసుపోగు కోటయ్య, ఒంగోలు వసంతకుమార్, బుజ్జి, అనీల్లు వేడుకలను పర్యవేక్షించారు. ఎస్సీ, ఎస్టీ, జర్నలిస్టు వారి కుటుంబాలతో ఈ వేడుకలకు హాజరైయ్యారు. కార్య క్రమానికి మొదటిగా విచ్చేసిన అంగలకుర్తి ప్రసాద్ సతీమణికి సంఘ పక్షాన అతిథుల చేతుల మీదగా శారీన బహుమతి ప్రదానం చేశారు.

## హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర -చీమకుర్తి: శనివారం రాత్రి చీమకుర్తి సీఐ ఎం. సుబ్బారావు రోడ్డు ప్రమాదాల గురించి మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణం గురించి సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరు కూడా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని హెల్మెట్ లేని ప్రయాణం అనర్ధదాయకమని తెలిపారు. హెల్మెట్ ధరించిన వాహనాలు నడిపే ఫ్లెక్సీలు పెట్టి అవేర్నెస్ ప్రోగ్రాం జరపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-పామూరు : ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ముందు టైరు ఊరిడి రోడ్డుపై పడి పోయిన సంఘటన ఆదివారం పామూరులో జరిగింది. ఒంగోలు డిపోకు చెందిన ఏ.పీ.39 వి.ఏ 5561 బస్సు పామూరు నుండి 20 మంది ప్రయాణికులతో ఒంగోలు వెళు తుండగా పట్టణ శివారులోని కందు కూరు రోడ్డులో పాల ఫ్యాక్టరీ వద్ద బస్సు ముందు టైరు ఊడి రోడ్డుపై పడి పోయింది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. ప్రయాణి కులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాలము చెల్లిన బస్సులను నడుపుతుండటం వలన ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

## ప్రైవేటు బస్సును ఢీకొట్టిన కారు - మహిళ మృతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రైవేటు బస్సు కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి ఇద్దరికి స్వల్ప గాలైన సంఘటన మండల కేంద్రమైన దోర్నాలలోని శ్రీశైలం రోడ్ లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్ నుండి శ్రీశైలం వెళు తున్న టూరిస్ట్ వాహనంను, కర్నూల్ నుండి శ్రీశైలం వెళ్తున్న కారు. బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మహిళ మృతి చెందింది, మృతురాలు వంకే మల్లిక (28) మృతి చెందగా, భర్త మురహరి బాబురావుకు, కుమార్తె జోషికకు, స్వల్ప గాయాలయ్యాయి, మృతి చెందిన వంకే మల్లిక శ్రీశైలం వైద్యశాలలో స్టాఫ్ నర్స్గా పనిచేస్తుంది. క్షతగాత్రులను పెద్ద దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


**మహారాజశ్రీ VII అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఒంగోలు**

**(SC & ST COURT)**

**Crl.R.P.No.12/2024 In C.C.No.449/2017**

Between:
M/s.Farm Agro Exim Pvt. Ltd., and others - Petitioners/Accused
And
Jasti Ramakrishna - Respondent
Jasti Ramakrishna, S/o. Tirupathaiah, Aged about 48 years Managing Partner, Sri Lakshmi Narasimha Raw & Boiled Rice Mill Pasupugallu village, Mundlamuru Mandal, Prakasam District, A.P., India

**నోటీసు**

పై నెంబరు క్రిమినల్ రివిజన్ పిటీషన్లో మీరు ప్రతివాది అయి వున్నారు. మీరు పై నెంబరు కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు నోటీసులు ఉద్దేశ్య పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేస్తూ వున్నారు. కావున మీరు పై కోర్టు వారి యెడుట తేది.06-01-2025న ఉదయం 10.30 ని॥లకు ప్రత్యక్షముగా గాని లేదా లాయర్ గారి ద్వారా కాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షమున కేసు విచారించి తీర్మానించెదరని ఈ నోటీసు ద్వారా తెలియపరచడమైనది.

శ్రీ కోర్టు వారి అనుమతితో.....

పసుపులేటి వెంకటేశ్వరరావు, అడ్వకేటు
రిజిష్టరు నెం. 247/2000 ఆఫ్ ఆంధ్రప్రదేశ్
తేదీ : 22.12.2024, స్థలం : ఒంగోలు.


## అమిత్‌షాను ప్రశ్నించ లేరా..?

**దళిత నేత నీలం**

విశాలాంధ్ర-ఒంగోలు : మాలలు మానవ హక్కుల యోధులని, అంబేద్కరును అవమానించినా అమిత్ షాను ప్రశ్నించని మాదిగలే మనువాదులని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో ఆదివారం జరిగిన మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ రావు 19 వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమం జరిగింది. నాగేంద్రరావు మాట్లాడుతూ మాలల జీవనం, ఉద్యమ ప్రస్థానం వాలీత కాదని, ఎదురీత అన్నారు. మాలలు చంద్రబాబు తల్లి అమ్మణమ్మ కాళ్లు మొక్కి ఉద్యమాన్ని ప్రారంభించలేదని, చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి నాయుడు చనిపోతే తప్పెట్లు కొట్టలేదన్నారు. అగ్రవర్ణాలకు అగ్రకులాలకు వ్యతిరేకంగా మాలలు ఉద్యమాలు నడిపారే తప్ప, అగ్రకులాల చందాలతో ఉద్యమాలు నడిపిన చరిత్ర మాలలకు లేదన్నారు. మహాత్మా గాంధీని ఇంటికి పిలిపించుకున్న కుసుమ ధర్మన్న మాల అని, అంట రానితనానికి వ్యతిరేకంగా పోరాడిన భాగ్యరెడ్డి వర్మ, బివిఎస్ వెంకట్ రావులు మాలలని, ఆంధ్రప్రదేశ్ ఏకైక దళిత ముఖ్యమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడుగా పనిచేసిన దామోదరం సంజీవయ్య మాల అని, పీపుల్స్ వార్ పార్టీ వ్యవస్థాపకుడు కెజీ సత్యమూర్తి మాల అని, దళితులను అవమానించారని అసెంబ్లీ సాక్షిగా రెడ్డి కులస్తుడ్ని చెప్పుతో కొట్టిన ఈశ్వరి భాయి మాల అని గుర్తుంచుకోవాలన్నారు. తన సంచి మోసాదని తెలంగాణకు చెందిన మంద ఏలియాకు కృష్ణ అని పేరు పెట్టిన కేజీ సత్యమూర్తి మాల అన్నారు. హరిహర తనయుడు అయ్యప్ప అయితే, చంద్రబాబు మందకృష్ణ తనయ వర్గీకరణ ఉద్యమం అన్నారు. 1994లో బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్లోకి రావడంతో చంద్రబాబు నాయుడు, మందకృష్ణ మాదిగ కుట్రలోంచి పుట్టిందే వర్గీకరణ సిద్ధాంతం అన్నారు.

## ఘనంగా రామానుజన్ జయంతి

**విశాలాంధ్ర- తాళ్లూరు:** తాళ్లూరు మండలంలోని పలు పాఠశాలల్లో ఆదివారం గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరు ఎబీసీ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతి సందర్భంగా కరస్పాండెంట్ టి. శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు సర్ శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులు మ్యాథ్స్ లో పట్టు సాధించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నిజ జీవితంలో మ్యాథ్స్ యొక్క ఆవశ్యకతను వివరించారు. విజేతలైన పలువురు విద్యార్థుల గురించి తెలిపారు. కరస్పాండెంట్ టి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మ్యాథ్స్ పట్ల ఆసక్తి పెంచుకుని కష్టంగా కాకుండా ఇష్టంగా ప్రాక్టీస్ చెయ్యాలని కోరారు. మ్యాథ్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎబీసీ హైస్కూల్లో మొదట అడుగు పెట్టిన విద్యార్థి మ్యాథ్స్ పట్ల కష్టంగా ఉంటారని, తర్వాత ఇష్టంగా మార్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగిన విషయాలను ఉదాహరణలతో వివరించారు. మ్యాథ్స్ ఇష్టంగా మార్చుటకు మ్యాథ్స్ లెజెండ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు చేస్తున్న కృషి ఆదర్శనీయమని కొనియాడారు.

డైరెక్టర్ కె. కాలేషాబాబు మాట్లాడుతూ.... ఇతర సబ్జెక్టులలో రాణించాలంటే మ్యాథ్స్ పట్ల చిన నాటి నుండే ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్ట్ పట్ల పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యున్నతి కోసం ఐఐటీ ఫౌండేషన్ కోర్సును నడిపిస్తున్నామని.. ఇంకా విద్యార్థులు ఇష్టంగా చదువుకోవాలని కోరారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు ధన్యవాదాలు చెప్పారు. అనంతరం మ్యాథ్స్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, విక్రమ్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ముందుగా ఆయా పాఠశాలలలో రామానుజన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయా పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయులకు విద్యార్థులకు మ్యాథ్స్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## గుంటి గంగా భవానికి పూజలు

**విశాలాంధ్ర- తాళ్లూరు:** జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మెట్టెల బాలరాజు, పి విజయలక్ష్మి, ప్రకాశ రావు, కామేశ్వర రావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్ కోసనా గురు బ్రహ్మం, ఈవో వాసు, ఆర్.ఎ కాటూరి ప్రసాద్‌లు ఆలయంలో భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

## ముగిసిన గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్

**విశాలాంధ్ర-గుంటూ రు వైద్యం :** సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్.షమా సుల్తానా ఆధ్వర్యంలో గుంటూరు పొన్నూరు రోడ్డులో ఉన్న ఎం.కన్వెన్షన్ హాలులో గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్, సింగింగ్, డాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్,

ఫ్యాషన్ షో, మెహెందీ, పొయెట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియెంటెడ్ స్కిట్ లాంటి పోటీలను ఆదివారం ఘనం గా ముగించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సలాం, నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానాలు మాట్లాడుతూ సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వ ర్యంలో గుంటూరు ఘాట్ టాలెంట్ షో గ్రాండ్ ఫినాలె పోటీలను ఘనంగా పూర్తి చేశామని, డిసెంబర్ 26వ తేదీన గురువారం సాయంత్రం 5 గంటల నుండి వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఇనాగరేషన్ జీజీటీ అవార్డ్స్ టిఎఫ్ఐ సెలబ్రిటీస్‌తో కల్చరల్ నైట్ గుంటూరు గాట్ టాలెంట్ షోలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్. కరీం, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మొగిలి దేవ అంతర్జాతీయ గుర్తింపు జిల్లాకు గర్వకారణం

**విశాలాంధ్ర-ఒంగోలు :** మన జిల్లాకు చెందిన డాక్టర్ మొగిలి దేవ సోషల్ మీడియా వేదికగా కళాకారుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందటం మన జిల్లాకు గర్వకారణమని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు, టిడిపి నాయకులు కొల్లిపల్లి సురేష్ అన్నారు. డా.మొగిలి దేవ యూట్యూబ్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రాంలలో దేశంలోని వివిధ భాషల్లో 2500 పైగా పాటలు రీల్స్‌లో నటించి, ప్రతిభ కనబరిచినందుకు గాను ఫేస్ బుక్ (మెటా) కంపెనీ వారు డా.మొగిలి దేవకు "రీల్స్ సూపర్ స్టార్" బిరుదు అవార్డుని ప్రదానం చేశారని మన జిల్లా వాసికి దక్కిన అరుదైన గౌరవమని సురేష్ తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ మరియు ఒంగోలు వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో..అంజయ్య రోడ్డులో ఆదివారం డాక్టర్ మొగిలి దేవని దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. తొలుత 2500 సాంగ్స్ పేరిట భారీ కేక్‌ని డా.మొగిలిచే కట్ చేయించి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, సిటిజన్ ఫోరం

అధ్యక్షుడు కొల్లా మధు మాట్లాడుతూ..కవి, రచయిత,సామాజిక కార్యకర్తగా సుపరిచితుడైన డాక్టర్ మొగిలి దేవ సోషల్ మీడియా ద్వారా తన రీల్స్ లో.. తెలుగు భాష వికాసానికి పద్యాలు, వ్యక్తిత్వ వికాస పాఠాలు, ఆధ్యాత్మిక విషయాలు, పాటలలో నటించి మెప్పించడం ద్వారా సమాజ చైతన్యానికి కృషి చేయటం అభినంద నీయమన్నారు. మన ప్రాంత వాసి ప్రతిభని మనం గౌరవించుకోవాలనే సదుద్దేశంతో డా.మొగిలిని తాము గౌరవంగా సన్మానించామని తెలిపారు. సినీ నటుడు, బిసి సమైక్య సమితి, రాష్ట్ర అధ్యక్షుడు ధన్నారపు మస్తాన్ రావు, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్‌లు మాట్లాడుతూ డా.మొగిలి దేవ రచయితగా తన ప్రతిభతో గతంలో కేంద్ర ప్రభుత్వ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు, పలు సంస్థల అవార్డులు సత్కారాలు అందుకున్నారని ఇప్పుడు కళాకారుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందటం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో.. అదపా జనార్ధన్,నైనాల వేణుగోపాల్, ప్రముఖ కవి కుర్రా ప్రసాద్ బాబు, మురళీకృష్ణ, శ్రీనివాసరెడ్డి, పెమ్మా నాగేశ్వరరావు, అంజి రెడ్డి, దేసు మల్లిఖార్జున, బ్రహ్మం, సంజీవరెడ్డి, బాలకృష్ణచౌదరి, రామకృష్ణ రెడ్డి,బాబురావు పాల్గొన్నారు.

## పద్మశాలియ సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

**విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ :** మార్కాపురం పట్టణంలోని శ్రీ మార్కండేశ్వర పద్మశాలీయ బహోత్తమ సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆ సంఘ గౌరవ అధ్యక్షులు కందగట్ల కేశవ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ డిపో మేనేజర్ అవ్వారు శ్రీధర నరసింహులు, ఉపాధ్యాయులు ఉక్కడపు సుధాకర్‌లు అతిథులుగా హాజరై మాట్లాడుతూ కమిటీ సభ్యులందరి సహకారంతో కలిసికట్టుగా పనిచేస్తే సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రిటైర్డ్ ఎమ్మార్వో అడిగొప్పుల వేణుగోపాల్ ,పెద్దారవీడు ఎంఈఓ ప్రగడ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. అనంతరం సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షులుగా గంజి రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల ఆదినారాయణ, కోశాధికారిగా గోపిశెట్టి గోపి నాథుడు లతోపాటు ఉపాధ్యక్షులుగా నారాయణ శ్రీరామచంద్రమూర్తి, అవ్వారి విజయ సారథి, తనికంటి ఈశ్వరయ్య లు సహాయ కార్యదర్శులుగా ఈపూరి

సుబ్బయ్య, అనుముల కిషోర్‌లు ఉప కోశాధికారులుగా ప్రగడ పవన్, తనికంటి నాగేంద్ర, దిగదారి నాగేంద్ర లతోపాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఎన్నిక అనంతరం నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కమిటీ సభ్యులందరితో కలిసి పద్మశాలియ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని సేవా కార్యక్రమాలు పెద్దల సలహా మేరకు ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల బాంధవులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.

## అఘోరీ దాడి ఘటనపై మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు

**విశాలాంధ్ర-మంగళగిరి :** గత నెల 18వ తేదీన మంగళగిరి ఆటోనగర్ అల్హా హోటల్ ఎదుట ఓ కార్ వాష్ సెంటర్ వద్ద అఘోరీ జరిపిన దాడిలో గాయపడిన ఆరేపల్లి రాజు అనే మీడియా ప్రతినిధి జాతీయ మానవ హక్కుల కమీషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సి)కి ఫిర్యాదు చేశారు. మంగళగిరికి చెంది న ఓ ప్రజాప్రతినిధి పదవీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వార్త కవరేజ్‌కి విలేకరులు వెళ్ళగా అదే ప్రాంతంలో కార్ వాష్ సెంటర్ వద్ద మారణాయు ధాలతో నగ్నంగా తిరుగుతూ స్థానికు లను భయభ్రాంతులకు గురిచేస్తున్న సందర్భంలో విలేకరులు ఆ ప్రాంతా నికి చేరుకున్నారు. అదే సమయంలో అఘోరీ తన కారులో ఉన్న ఇనుప రాడ్డును తీసుకొని విలేకరితో పాటు కార్ వాష్ సెంటర్‌లో ఉన్న యువక ులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడింది. ఈ ఘటనలో విలేకరి కాలు విరిగి తీవ్ర గాయాలపాలవ్వగా స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. కాగా సదరు ఘటనలో పోలీసులు అఘోరిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిం చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అఘో రీపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ మానవ హక్కుల కమీషన్‌కి బాధితుడు ఫిర్యాదు చేశారు.

## శ్రమయేవ జయతే పురస్కార ప్రదానం

**విశాలాంధ్ర-తెనాలి :** విద్య లేకుండా తాము ఎంచుకున్న రంగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగటమే కాకుండా ఎన్నో కుటుంబాలకు జీవనోపాధిని చూపుతున్న పలు రంగా కార్మికులను గుర్తించి శ్రమయేవ జయతే పురస్కా రంతో సత్కరిస్తున్న పసులేటి కోటేశ్వ రరావు తులశమ్మ స్మారక కమిటి వ్యవ స్థాపకులు తన్నీరు శివశంకర్ అభినం దనీయులని చిన పరిమికి చెందిన సీనియర్ రైస్ మిల్లర్ మర్రెడ్డి బసిరెడ్డి అన్నారు. పసులేటి కోటేశ్వరరావు తుల శమ్మ స్మారక శ్రమయేవ జయతే పుర స్కార ప్రదానోత్సవ కార్యక్రమం తెనాలి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయం లో ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా

వీరబ్రహ్మేంద్ర చరిట బుల్ ట్రస్ట్ ఈఎల్‌వి అప్పారావు మాస్టా రు పాల్గొని మాట్లాడుతూ కన్నబిడ్డలే తల్లిదండ్రులను మరచిపోతున్న ఈ రోజుల్లో అమ్మమ్మ తాతయ్యల పేరుతో పురస్కారాలను అందిస్తున్న తన్నీరు శివశంకర్ యువతకు ఆదర్శమన్నారు. గుంటూరుకు చెందిన ఫ్రెండ్స్ ఇంజనీ రింగ్ వర్క్స్ అధినేత షేక్ మొహిద్దీన్, తెనాలి పట్టణానికి చెందిన సెంట్రింగ్ వర్క్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మట్టుపల్లి సాంబయ్యలకు శ్రమయేవ జయతే పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కమిటి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా విద్య లేకపో యినా కేవలం శారీరక శ్రమకు బుద్ధిని జోడించి తమ రంగంలో ఉన్నత స్థాయి కి ఎదిగిన వారిని గుర్తించి ఈ పుర స్కారాలను ప్రదానం చేస్తున్నామ న్నారు. పురస్కార గ్రహీతలకు అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో పసుపులేటి మల్లిఖార్జునరావు, తన్నీరు కళ్యాణ్‌కుమార్, వినోద్, హేమ్ కుమార్, రామమోహనరావు చౌదరి, షఫీ, రాంబాబు, మురళి పాల్గొన్నారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

**విశాలాంధ్ర - బల్లికురవ :** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణం అత్యంత ప్రమాదకరమని సంతమాగులూరు సర్కిల్ ఇనిస్పెక్టర్ కె వెంకట్రావు అన్నారు. ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించక పోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది మృతి చెందుతున్నారని తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి,బాపట్ల డిఎస్పీ జి రామాంజనేయులు ఆదేశాల మేరకు ఆదివారం బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని సిబ్బందితో సంతమాగులూరు సర్కిల్ ఇనిస్పెక్టర్ కె వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు సిబ్బంది హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ హెల్మెట్ ధరించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా సీఐ కె వెంకట్రావు మాట్లాడుతూ సంతమాగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. దేశంలో రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారిలో ఎక్కువ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే ఉన్నారన్నారు. హెల్మెట్ ధరించక పోవడమేనన్నారు. ప్రజలకు అవగాహన కలిగించేందుకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి రక్షణ కవచంలా హెల్మెట్ ఉంటుందన్నారు. కావున ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు ఎస్సై ఎం పట్టాభిరామయ్య,బల్లికురవ ఎస్సై జివి చౌదరి,సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు దుస్తులు పంపిణీ

**విశాలాంధ్ర - అద్దంకి :** ఎస్ఎస్‌సి 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవాస్ఫూర్తి కమిటీ సభ్యులు ఆదివారం సింగరకొండ లోని రామ మందిరం, కష్టజీవుల సేవా సంఘం వృద్ధాశ్రమాలలో ఉంటున్న 75 మంది నిరుపేద వృద్ధులకు పండుగలను పురస్కరించుకొని రూ.37,500 విలువ కలిగిన నూతన పంచెలు, చొక్కాలు, కండువాలు, చీరలు జాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ మాట్లాడుతూ 2015 నుండి తమ కమిటీ ద్వారా క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం క్రిస్మస్ నూతన సంవత్సరం సంక్రాంతి పండుగల సందర్భంగా పేద వృద్ధులకు నూతన వస్త్రాలు అందిస్తున్నామని ఇప్పటికీ తమ కమిటీ ద్వారా 40 లక్షల విలువ చేసే సేవా కార్యక్రమాలు చేశామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలానే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు ధామా వెంకటేశ్వర్లు, సభ్యులు అక్కిరెడ్డి, రామ సుబ్బారావు, మొండితోక ఇజ్రాయేలు, శ్రీనివాసరెడ్డి, ఘంటసాల శ్రీనివాసరావు, కొండపల్లి శైలజ, పోలూరి శాంతి కుమారి, కొత్త శ్రీమన్నారాయణ, బాలాజీ, చెన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఊడిన లారీ టైరు... తప్పిన ప్రమాదం

**విశాలాంధ్ర - చెరుకుపల్లి :** జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న లారీ టైరు ఊడటంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారున్ని ఢీకొట్టింది. ఆదివారం మార్కెట్ దగ్గర ఉన్న ప్రజలు అప్రమత్తమై లారీని ఆపి క్షతగాత్రునికి ప్రాథమిక చికిత్స చేశారు. చెన్నై వైపు నుండి రేపల్లె వైపుకు వస్తున్న పది టైర్ల లారీలో ఓ టైరు నట్టు ఊడిపోయి రోడ్డుపై వేగంగా వచ్చి వాహనదారులను ఢీకొట్టింది. అయితే చిన్న చిన్న గాయాలతో అతను బయటపడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## క్రీస్తు బోధనలే ప్రపంచానికి మార్గదర్శకాలు

**విశాలాంధ్ర - బాపట్ల :** క్రీస్తు బోధనలే ప్రపంచానికి మార్గదర్శకాలు అని పరోపకారం, పొరుగువారికి ప్రేమను పంచడం వంటి క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని శాంతియుతంగా నడిపించడంలో కీలక భూమిక వహిస్తున్నాయని వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి లోని వివేక సర్వీస్ సొసైటీ ఆవరణలో 20వ వార్షిక కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎన్‌వివి నాగరాజు, ప్రముఖ ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, వివేక కార్యదర్శి అంబటి మురళీకృష్ణ తదితరులు విద్యార్థుల కేరింతల మధ్య, ఉల్లాస భరిత నృత్యాల నడుమ కమ్యూనిటీ క్రిస్మస్ కేకును కత్తిరించి సందడి చేశారు. బాలలకు మిఠాయిలు, కేకును, ఫలహారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకా కార్యదర్శి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా నిరంతరాయంగా కమ్యూనిటీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తూ ప్రభువైన ఏసుక్రీస్తు నామముతో అందరితో కలిసి వేడుకగా జరపడం ఆనవాయితీగా వివేక సర్వీస్ సొసైటీ కొనసాగిస్తున్నదన్నారు. సర్వ మానవాళి సుఖసంతోషాలతో జీవించాలని, పాపము నుండి రక్షణ పొందాలని తన రక్తాన్ని చిందించిన ప్రభువు యేసుక్రీస్తు సందేశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ క్రిస్మస్ అంటే కుల మత జాతి వివక్షలకు తావు లేకుండా అందరూ సమిష్టిగా పండుగను జరుపుకోవడం అనే సందేశాన్ని వివేక సర్వీస్ సొసైటీ ఆచరణలో చేసి చూపుతున్నదన్నారు. సంస్థ పరిధిలోని 40 వేల కుటుంబాలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వివేక విద్యాశ్రమ్ స్టువర్టుపురం, లిటిల్ జెమ్స్ విద్యాశ్రమ్ పొన్నూరు విద్యార్థినీ విద్యార్థుల ఆధ్యాత్మిక పాటల నృత్యాలు అందరినీ అలరించాయి.

## 450 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

**విశాలాంధ్ర - నిజాంపట్నం :** నాటు సారా తయారీ స్థావరంపై దాడులు నిర్వహించామని నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని అదవల గ్రామ పరిసర ప్రాంతాల్లోని దక్షిణ దిశగా సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో గల మడ అడవులలో బాపట్ల ఈఎస్టిఎఫ్ ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, రేపల్లె పీడిఈఐ దివాకర్, ఎస్టిఎఫ్ వారితో పాటు తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా మూడు ప్రాంతాలలో నాటుసారా తయారీకి ఉంచిన 450 లీటర్ల బెల్లపు ఊటతో పాటు ఒక నాటుసారా బట్టీను కనుగొని ధ్వంసం చేశామని చెప్పారు. నాటు సారాని తయారు చేసే,అమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందని అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా తయారీ,అమ్మకాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే తమ సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. నిజాంపట్నం మండలంలో నల్లబెల్లంను నాటు సారా తయారీదారులకి అమ్మేవారిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ దాడులలో కానిస్టేబుల్ కె.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి,కె.మధుసూదనరావు, డ్రైవర్ పి.భాస్కర్ పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

**విశాలాంధ్ర - అద్దంకి :** రక్తహీనత సమస్యతో బాధపడుతున్న పట్టణానికి చెందిన వసంత నాగేశ్వరరావు (70)కు వైద్యులు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం ఎక్కించాలని తెలపగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తాటిపర్తి ఈశ్వర రెడ్డిని ప్రోత్సహించి అతని చేత రక్తదానం చేయించారు. రక్తదాత ఈశ్వరరెడ్డిని రోటరీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ కార్యదర్శి చుండూరి మురళి సుధాకర్ రావు, రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య,సంధిరెడ్డి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఏలూరి

**విశాలాంధ్ర - యద్దనపూడి :** మండలంలోని అనంతవరం గ్రామ టిడిపి నాయకులు కీశే కుప్పాకుల రమేష్ బాబు కుమారుడుకి ఇటీవల వివాహం అయిన సందర్భంగా నూతన వధూవరులను పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ టిడిపి నాయకులతో సమావేశమై గ్రామంలోని అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుద్దె తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, నిమ్మల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, పెరవల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

**విశాలాంధ్ర - యద్దనపూడి :** క్రిస్మస్ పండగను పురస్కరించుకొని యద్దనపూడిలో టిడిపి నాయకులు కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రేమ, దయను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, అందరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, యలమంద ,మోషే, గోపికృష్ణ ,నాని ,వీర మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో గొట్టిపాటి లక్ష్మి

**విశాలాంధ్ర-దర్శి :** దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి మండలానికి చెందిన పోకూరి సుబ్బారావు కుమారుడు దర్శి పట్టణానికి చెందిన వీఆర్వో రాయవరపు శ్రీనివాసరావు కుమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట మాజీ శాసనసభ్యులు పాపారావు నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, దర్శి పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ నారంశెట్టి మధు, కల్లూరు సుబ్బు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నుంచి ప్రాణాలతో బయటవడవచ్చని నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం నాగులుప్పలపాడులో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## హాజీపురం క్రాస్ రోడ్డు వద్ద...

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని హాజీపురం క్రాస్ రోడ్ వద్ద శనివారం రాత్రి హెచ్ ఎంపాడు ఎస్సై కె.మాధవరావు రోడ్డు ప్రమాదాల గురించి ,హెల్మెట్ లేకుండా ప్రయాణం గురించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఒక్క వాహనదారుడు కూడా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని హెల్మెట్ లేని ప్రయాణం అనర్థదాయకమని వారు తెలి పారు. అలానే హెల్మెట్ ధరించిన వాహనాలు నడిపే ఫ్లెక్సీలు పెట్టి అవేర్నెస్ ప్రోగ్రాం జరపడం జరిగింది. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ కాట్వా దశాబ్ది ఉత్సవాల్లో 'ఆకుపాటి'

విశాలాంధ్ర-పామూరు : ఏపీ కాట్వా ప్రకాశం జిల్లా పదో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కాట్వా వారి ఆహ్వానం మేరకు కనిగిరి నియోజకవర్గ కాట్వా ఎమినేట్ పర్సన్ గా పామూరు పట్టణానికి చెందిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ పాల్గొన్నారు. 2024 మార్చి లో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులు పైబడిన 7 మంది విద్యార్థులకు 20 వేల రూపాయలు తన వంతుగా స్కాలర్షిప్ రూపాన వెంకటేష్ అందజేయడం జరిగినది. అనంతరం ఏపీ కాట్వా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ ని ఘనంగా సన్మానించి మెమొంటోను బహుకరించారు ఈ కార్యక్రమంలో ఏపీ కాట్వా వ్యవస్థాపకులు కొల్లా నారాయణ, ఫణీంద్ర కుమార్, జిల్లా కాట్వా అధ్యక్షులు బి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు తూము శ్రీనివాసరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, కుప్ప రంగ సాయి, మలగా రమేష్,జిల్లా ఎక్స్క్యూటివ్ మెంబర్ గద్దె సుధాకర్, కొంకనాల రామ్మోహన్రావు, ఎన్ వెంకటరామయ్య, నరసింహారావు జిల్లా కాట్వా సభ్యులు మరియు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-పామూరు : లాయల్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థలో బాలికలకు ఎస్ఐ టి కిషోర్ బాబు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నూనె ప్రసాద్ దంపతులు, ఏఎస్ఐ ముల్లా పాల్గొన్నారు.

# ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-మార్కాపురం : సమాజం మార్పు కోసం చేసే పనిలో నిజమైన ఆనందం, సంతోషం ఉందని ప్రతిరోజు ఆనందం సంతోషాల మధ్య జీవించడమే నిజమైన క్రిస్మస్ అని హ్యాండ్సప్ కంపాషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.ఆనంద్ బెంజిమెన్ అన్నారు. ఆది వారం హ్యాండ్సప్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను టి.మమత మాధురి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గాడ్ ఇస్ లవ్ మినిస్ట్రీ సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ హ్యాండ్సప్ కంపాషన్ సంస్థ చీకటి నుండి వెలుగు దిశగా హెచ్ఐ వి, ఎయిడ్స్ లేని సమాజ నిర్మాణమే తమ ధ్యేయంగా పనిచేస్తూ

సమాజ మార్పు కోసం ప్రజలను మంచి మార్గం వైపు చూసేలా చేసే సేవా కార్యక్రమాలు కొనియాడదగినవని అన్నారు. ప్రాజెక్టు మేనేజర్ కె.విజయ్ కుమారి మాట్లాడుతూ మూడు జిల్లాలలో 8 మండలాలలో 56 ఏరియాలలో హ్యాండ్సప్ కంపాషన్ సంస్థ తమ సేవలను కొనసాగిస్తుందని అన్నారు. అనేక మంది జీవితాలలో వెలుగులను నింపుతూ వందల కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తుందని అన్నారు. అనంతరం సిబ్బందికి నూతన వస్త్రములను బహుకరించి ప్రేమ విందును ఏర్పాటు చేయడం జరిగింది. హౌసింగ్ డిఈఈ డి.నిరీక్షణ్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఇండ్లూరి అనోజిరావు, ప్రముఖ న్యాయవాది కె.ఝాన్సీ రాణి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆదిమూలపు లూక, ఉపాధి హామీ ఏపీవో టి.జీవరత్నం, సంస్థ ప్రతినిధులు పూర్ణకంటి తిరుమలయ్య, ఏఎన్ఎం కె.విజయ కుమారి, కె.బ్రహ్మయ్య, షేక్ షబానా, సిబిఓ ప్రెసిడెంట్ అలియాబాన్, ఏఆర్టి కౌన్సిలర్లు, స్టేట్ హోల్డర్స్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునద్ధరించాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునర్దరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం ఉప్పుగుండూరులో సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో కేంద్రప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో గత పాలకులైన టీడీపీ,వైసీపీ లు వెల్ఫేర్ బోర్డు నిధులు 1600 కోట్లు పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు వినియోగించి బోర్డును నిర్వీర్యం చేసారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల మీద వసూలు చేస్తున్న సెస్‌లను కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. కాని గత ఐదు సంవత్సరాల కాలంలో డెత్ క్లయిమ్‌లు కాన్పులు తదితర సంక్షేమ పదకాలు నిలుపుదల చేసారని వాటిని తిరిగి పునద్ధరించాలని డిమాండ్ చేసారు. పంచాయతీ విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అంగన్ వాడీ ఆశా వర్కర్లు సమ్మెసందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. స్కీం కార్మికులపై రాజకీయ వేదింపులు ఆపాలన్నారు. ఈనేపథ్యంలో అందరు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవడానికి అన్ని రంగాల కార్మికులు సిఐటియు సభ్యత్వం చేరి సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్.రామారావు, జి బసవ పున్నయ్య, నాయకులు చిరంజీవి, బాలకృష్ణ, ఏలీషా, వీరయ్య తదితరులు ఉన్నారు.

## క్రీస్తు పుట్టుక ప్రపంచ మానవాళి అభ్యుదయానికి దోహదం

విశాలాంధ్ర-దాచేపల్లి : క్రీస్తు పుట్టుక ప్రపంచ మానవాళి అభ్యుదయానికి దోహదపడినట్లు విద్యుత్ శాఖ ఏఓ పగడాల సందీప్ కుమార్ చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నారాయణపురంలోని కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏఓ సందీప్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జేఏఓ ఆశీర్వాదం, పట్టణ ఏఈ భగవాన్, గ్రామీణ ఏఈ దండా నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈఆర్ ఓ, ఓఎమ్మెన్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర-దుర్గి : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభచాటి విజేతలుగా నిలిచిన దుర్గి విద్యార్థులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక స్పృహను పెంచే పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి పి.చంద్రిక(గవర్నమెంట్ జూనియర్ కాలేజ్), ద్వితీయ బహుమతి డి.జీవ జయన్, వక్తృత్వ పోటీల్లో పి.హేమ(కేజీబీవి జూనియర్ కాలేజ్) ద్వితీయ బహుమతి, బి.మేఘన తృతీయ బహుమతి, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన లిఖిత్, లక్ష్మీకుమారి తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు జ్ఞాపికలను బహుకరించారు. ఆర్వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థులను కేజీబీవీ ప్రిన్సిపల్ ఆశా జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

## సీఎం చంద్రబాబుతోనే పేదలకు ఆర్థిక భరోసా

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీలో ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు అంటేనే పేద కుటుంబాలకు భద్రత,ఒక భరోసా అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.ఆదివారం క్యాంప్ కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ చికిత్స పొందిన 41 మందికి ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సీఎంఆర్ఎఫ్ రూ. 39,39,567 చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొండంత అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సీఎంఆర్ఎఫ్‌ను పునర్నిర్మాణం చేశారన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో పేదలకు ఆర్థిక భరోసా కరువైందన్నారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు కార్పొరేట్ వైద్య అందించేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.అత్యవసరంలో సైతం కార్పొరేటర్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు పొందిన వారికి ఆర్థికంగా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి సీఎంఆర్ అందించిన దాఖలాలు లేవన్నారు.ఐదు నెలల కాలంలోనే రెండు కోట్లకుపైగా పేదలకు ఆర్థిక భరోసా అందించామన్నారు.పేదల ఆరోగ్య విషయంలో కూటమి ప్రభుత్వం కొండంత భరోసాగా నిలుస్తుందన్నారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న వారికి సైతం ఎల్‌ఓసిలు అందజేసి సీఎంఆర్ఎఫ్ వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు.సీఎంఆర్ఎఫ్ పేదల పాలిటి వరంగా మారిందన్నారు.అనంతరం చెక్కులు పంపిణీ చేశారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో చిన్నగంజాం అభివృద్ధి

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - బాపట్ల : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో చిన్నగంజాం మండల అభివృద్ధికి పాటుపడతానని, అభివృద్దే తారక మంత్రంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలోని చిన్నగంజాం మండల పరిధిలోని కడవకుదురు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహా విష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్ కుమార్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబుతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వేచ్ఛ స్వాతంత్ర్య ఫలాలను అందించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుందన్నారు. సమాజంలో అసమానతలు తొలగించేలా ప్రజలకు హక్కుల కల్పనలో అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహద పడిందన్నారు. చిన్నగంజాం మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నానన్నారు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ మండలాన్ని అద్భుతంగా తీర్చి దిద్దేందుకు అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు పాటుపడతానన్నారు. అభివృద్ధికి ప్రజల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రగతి బాటలు వేస్తానని పేర్కొన్నారు. గత ఐదేళ్లు వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అయినా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల వారి అరాచకాల నుంచి చట్టం న్యాయంతో బయటపడగలగామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళు అభివృద్ధిని అటకెక్కించి రాజకీయ పబ్బం గడుపుకుందని ధ్వజ మెత్తారు. చిన్నగంజాం మండల అభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. మండల పరిధిలోని తీర ప్రాంతంలో ఓడల తయారీ పరిశ్రమకు, పోర్టు నిర్మాణానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని రిపోర్టులు అందాయని, వాటి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నగంజాం మండలాన్ని టూరిజం హబ్‌గా, పరిశ్రమలు హబ్‌గా రూపొందించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, మండల పార్టీ అధ్యక్షులు పొదా వీరయ్య, నక్కల నారాయణ నక్కల రాఘవ, కుమార్, వీరస్వామి, నాగరాజు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

- కడవకుదురు గ్రామంలో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఎమ్మెల్యే ఏలూరికి ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

విశాలాంధ్ర - చీరాల : పండగకు బట్టలు కొనడానికి చీరాల వచ్చి ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చీరాల పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు బాపట్లకు చెందిన ప్రేమ్ కుమార్ దివ్య దంపతులకు ఇద్దరు కుమారులు క్రిస్మస్ సందర్భంగా పట్టణంలో బట్టలు కోనుగోలు చేసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో బాపట్ల వెళుతుండగా చీరాల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బస్సు గుద్ది బాలుడు రాహుల్(9) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రేమ్‌కుమార్, దివ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌తో సహా సహా బస్సును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుబారం

విశాలాంధ్ర-వెలిగండ్ల : గ్రామాలు, పట్టణాల్లో స్మార్ట్ మీటర్ల పేరుతో స్మార్ట్ బాంబులను అమరుస్తున్నారని ఇది ప్రజలపై భారమని సీపీఎం మండల నాయకులు రాయల మాలకొండయ్య అన్నారు. ఆదివారం మండలంలోని వెలిగండ్ల కేంద్రం నందు స్మార్ట్ మీటర్ల పై ఇంటింటి ప్రచారం కరపత్రాలు ఇస్తూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై పెను భారం మోపేందుకు సిద్ధమవుతుందని ప్రభుత్వం ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇది ప్రభుత్వాలు మారినప్పటికీ వాటి ఆలోచన విధానంలో ఎటువంటి మార్పు రావటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

# డిపాజిట్లు దక్కవనే ఎన్నికలు బహిష్కరిస్తున్న వైసీపీ: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : అయిదేళ్లు అధికారంలో చేసిన పాపాలకు ప్రజలు డిపాజిట్లు కూడా ఇవ్వరనే భయంతోనే వైకాపా ఎన్నికలు బహిష్కరిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలే కాదు 2029 పోరులోనూ జగన్ పార్టీ ఇంటికే పరిమితం కావడం ఖాయ మని స్పష్టం చేశారాయన. ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు తథ్యమన్నారు. గుంటూరు ఏటుకూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. కేంద్రమంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అను రాధ, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, గల్లా మాధవి, నజీర్ అహ్మద్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బూర్ల రామాంజనే యులు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఆలపాటి రాజాకు మంత్రిగా చేసిన అనుభ వంతో పాటు అనేక రైతు ఉద్యమాలు నడిపారన్నారు. విద్యా సంస్థలు నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి అవకా శాలు కల్పించారని, అలా ఉద్యోగుల కష్టసుఖాలు తెలిసిన, నిరుద్యోగుల పట్ల గౌరవం ఉన్న వ్యక్తిని భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లక్షలాది మందికి ఉద్యోగాలని చెప్పి మోసం చేసినందుకే మొహం చెల్లకనే జగన్ ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించారన్నారు. తమకు పోటీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వ్యక్తులు జగన్ రెడ్డి పాలనలో తప్పులపై ఎమ్మెల్సీగా ఉండి ఏనాడైనా మాట్లాడారా? ఎందుకు ప్రశ్నించలేదో పట్టభద్రులంతా ఆలోచన చేయాలన్నారు. విజన్-2047తో స్వర్ణాంధ్రప్రదేశ్, ఐదేళ్లలో రాష్ట్రానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాల్లో ఎప్పుడూ లేనిరీతిలో అభి వృద్ధి బాటలు వేస్తున్నారని చెప్పారు. మంత్రి లోకేష్ విదేశా లకు వెళ్లి లక్షలాది కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారని, లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. వైకాపా పాలనలో ఉద్యోగాల్లేవు, పరిశ్రమల్లేవు, పెట్టుబడుల్లేవు, ఉపాధి అవకాశాల్లేవని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయలేదు, ప్రైవేటు సంస్థలను కక్షగట్టి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని మండిపడ్డారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత లక్షలాది కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు కూడా వస్తున్నాయన్నారు.

## మండల స్థాయిలోనూ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరే ట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను ప్రతి సోమ వారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్ర మాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివి జనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మౌనికశ్రీకి అబ్దుల్ కలామ్ పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : డాక్టర్ చివుకుల హనుమం తరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో స్థానిక హిందూ ఇంజనీ రింగ్ కళాశాలలో జరిగిన పుర స్కార ప్రధానోత్సవ కార్యక్రమం లో మౌనికశ్రీ 'కలామ్ ఇన్స్పిరే షనల్ అవార్డ్' అందుకుంది. సుగుణ సైన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చివుకుల హను మంతరావు, సెక్రటరీ పత్రి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అనేక రాష్ట్రాల నుంచి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యా యులు, విద్యార్థులను గుర్తించి ప్రతి సంవత్సరం పురస్కా రాలను అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. మౌనికశ్రీ ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో జ్ఞాపకశక్తిలో 52 రికార్డులు, 178 అవార్డులు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందుకుంది. తెలంగాణ ప్రభుత్వ అవార్డుతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు, చెరువు రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక కేరళ మోడల్ స్కూల్‌లో ఆదివారం నరసరావుపేట శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, గ్రామీణ వైద్యులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీ వైద్యులు సీజనల్ వ్యాధులు, సాధారణ వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం గ్రామీణ వైద్యులకు మెడికల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ పీఆర్వో భాషా, గ్రామీణ వైద్యులు సిరిపరపు అంజిబాబు, నుసుం భాస్కర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న చర్చిలు

విశాలాంధ్ర-తాడికొండ : క్రిస్మస్ పర్వదినాన్ని పుర స్కరించుకుని మండలంలో క్రైస్తవ చర్చిలు ముస్తాబవుతున్నాయి. వివిధ రంగులు, అలంకారాలతో చర్చిలను తీర్చి దిద్దుతున్నారు. ప్రధాన కూడళ్ళు, సెంటర్లు, చర్చిలు, ఇళ్ల వద్ద వివిధ రంగులతో డిజైన్లతో స్టార్లను ఏర్పాటు చేశారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతూ స్టార్లు వెలిశాయి. ఇప్పటికే అనేక చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకకు సంబంధించి నాటక, నాటికలను ప్రదర్శిస్తున్నారు. 24, 25 తేదీలలో క్రిస్మస్ ట్రీని ఆయా గ్రామాలలో ఊరేగించనున్నారు. గ్రామాలలో క్రిస్మస్ సందడి నెలకొంది. సుదూర ప్రాంతంలో ఉన్న ఉద్యోగులు వ్యాపారులు క్రిస్మస్ పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకుంటు న్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## నాగభూషణంకు సాహిత్య పురస్కారం

విశాలాంధ్ర - అద్దంకి : పుట్టంరాజు బుల్లయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కార సభ ఆదివారం ఇందిరానగర్‌లోని పుట్టం రాజు కళాక్షేత్రంలో ట్రస్టు అధ్యక్షులు పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పద్యం, గేయం, వచన వంటి విభిన్న ప్రక్రియల్లో సాధికారమైన పట్టు కలిగిన కవి డాక్టర్ కాసల నాగభూషణం అని, ఆముక్త మాల్యదకు కాసల చేసిన సరళ వచన అనువాదం ప్రసిద్ధమైనదని ప్రముఖుల ప్రశంసలను అందుకున్నదని అనేక పత్రికలలో కాసల రచించిన కవితలు, కథలు వ్యాసాలు ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. అనంతరం పుట్టం రాజు బుల్లయ్య రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారాన్ని పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి శైలజ దంపతులు పురస్కార గ్రహీత అధ్యాపకరత్న డాక్టర్ కాసల నాగభూషణంకు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు దేవపాలన, దివాకర దత్తు, నారాయణ బాలసుబ్రమణ్యం, ఇలపావులూరి సాయి, లక్కరాజు శ్రీనివాస రావు, అన్నమనేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.వివిధ వృత్తులలో ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరు వేసుకున్నారు. గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శివన్నారాయణ,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్‌కు అవార్డులు

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలో వాకర్స్‌అసోసియేషన్ చేస్తున్న సేవలకు గాను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 కాన్ఫరెన్స్ అవార్డ్స్ ఫంక్షన్‌లో బెస్ట్ ప్రెసిడెంట్ బెస్ట్ సెక్రటరీ అవార్డులు అందించారు.ఆదివారం నెల్లూరు జీపీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 కాన్ఫరెన్స్ అవార్డ్స్ ఫంక్షన్‌లో చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న సభ్యులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో తమ వంతు సమాజానికి సేవా చేస్తున్నామని,మేము చేస్తున్న సేవలు గుర్తించి అవార్డులు అందించడం ద్వారా మాపై మరింత భాధ్యత పెరిగిందన్నారు.వాకర్స్ క్లబ్ చేసిన సేవలకు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీ మోహనరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా చీరాల వాకర్స్ క్లబ్‌కి బెస్ట్ ప్రెసిడెంట్,బెస్ట్ సెక్రటరీ అవార్డులు,8మెమేంటోలు,26 ఎంజిఎఫ్‌ల ద్వారా వాకర్స్ ఫౌండేషన్ ఒక లక్ష ఎనభై రెండు వేలు సమకూర్చి కప్ అందజేసి శాలువాతో సత్కరించారన్నారు. ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ,సెక్రెటరీ చారగుళ్ళ గురుప్రసాద్,చెలికాని సీతారామయ్య,జీవి సుబ్బారావు,బలరామనాయుడు, అమరా వీరాంజనేయులు, తిరుపతిరావు, నిత్యానంద లాల్,రవి,వల్లెపు శ్రీనివాసరావు, నారాయణమూర్తి,మల్లిఖార్జున రావు,రామారావు,కళాధర్ సుబ్బారావు,డాక్టర్ బాబూరావు,సుభాషిణి,శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సీపీఐ శతవసంత ఉత్సవాలను జయప్రదం చేయాలి

### సీపీఐ సీనియర్ నాయకులు జెల్ది భాగ్యశ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : సీపీఐ పార్టీ శత వసంత ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ సీనియర్ నాయకులు జెల్ది భాగ్య శ్రీధర్ పిలుపునిచ్చారు.శనివారం బాపట్ల పట్టణంలోని శృంగరపురం సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ సీపీఐ శతాబ్ద కాలంగా పేద, బడుగు,బలహీన వర్గాల కర్షకులకు అండగా ఉంటూ పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిందని శ్రీధర్ అన్నారు.స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీ సీపీఐ పార్టీ అని ఆయన కొనియాడారు.దేశ స్వాతంత్రం కోసం పలు పోరాటాలు చేసి ఎంతోమంది కమ్యూనిస్టు నాయకులు జైలుకెళ్లి జైలు జీవితం గడిపారన్నారు.దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి ఆ పోరాటాలతోనే స్వాతంత్రం సాధించిందన్నారు. ఇప్పుడు అధికారం చలాయిస్తున్న మతోన్మాద బీజేపీ ఆనాడు ఏ ఉద్యమాలు చేయకుండా స్వాతంత్ర పోరాటంలో పాల్గొనకుండా ఇప్పుడు అధికారం అనుభవిస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ మతాల మధ్య చిచ్చుల పెడుతూ దేవుడి పేరుతో పబ్బం గడుపుకుంటూ కులాల పేరుతో గొడవలు పెడుతూ చోద్యం చూస్తుందని ఆయన విమర్శించారు.పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెనకేసుకొస్తున్న ప్రధాని మోడీ వారి మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అంబేద్కర్‌ను అవమాన పరుస్తున్నారన్నారు.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మీద పార్లమెంట్ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి అమిత్ షాకి గుర్తులేదా అని శ్రీధర్ ప్రశ్నించా రు.ఆనాటి నుండి నేటి వరకు ఎర్ర జెండా అప్పుడు ఇప్పుడు ఎప్పటికీ పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో నిత్యం ప్రజా పోరాటంలో ఉండి, ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి ప్రజల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన కొనియాడారు.ఈనెల 26వ తేదీన సీపీఐ శతాబ్ది వసంత ఉత్స వాలను జయప్రదం చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్క రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 26న శతాబ్ది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వాడవాడలా ఎర్రజెండా అరుణ ప్రతాకాన్ని ఆవిష్క రించి శత వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు.పేద బడుగు బలహీన వర్గాలకు ఎర్రజెండా ఎప్పుడు అండగానే ఉంటుందన్నారు.ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి కార్మికులు రైతులు హక్కులను సాధించుకున్న ఎర్ర జెండా ఎప్పుడు పేదల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటుందని తెలిపారు.ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కార్మికులు రైతులు పక్షాన నిలబడి వారి హక్కులను సాధించడంలో వారి కోసం నిరంతరం పోరాడుతూ ఉండే పార్టీయే ఎర్రజెండా పార్టీ అని కొనియాడారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా ముందు గుర్తుండే పార్టీ ఎర్రజెండా పార్టీ అని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని పట్టణాలు గ్రామాల్లో శాఖ సమావేశాలు నిర్వహించి పార్టీ శతాబ్ది ఉత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. ముందుగా అమరులైన సీపీఐ నాయకులకు నివాళులర్పించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యటగిరి శ్రీనివా సులు,ముత్తి రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'ఇంకొల్లు'కు విజ్ఞాన్ గురు పురస్కారం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పదవీ విరమణ వయసుకే గాని విజ్ఞానానికి కాదని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభానీ అన్నారు. మండల పరిధిలోని బాపూజీ ఎయిడెడ్ పాఠశాల నందు సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేసి పదవీ విరమణ చేసిన అనంతరం ఎందరికో మార్గదర్శకంగా ఉన్న ఇంకొల్లు రంగారావుకు విజ్ఞాన్ గురుపురస్కారం రావడం సంతోషదాయమన్నారు. సైన్సు ఉపాధ్యాయుడుగా పనిచేసి అనంతరం విద్యా మరియు విజ్ఞాన శాస్త్ర అంశాలలో అధ్యయనం చేస్తూ విద్యావ్యాప్తికి విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషిచేసిన ఆయనకు ఈ అవార్డు రావడం సముచితమన్నారు. డాక్టర్ చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ మరియు సుగుణ సైన్స్ అకాడమీ వింజనంపాడు గుంటూరు వారు ఆయన ప్రతిభను గుర్తించి ఆదివారం హిందూ ఇంజనీరింగ్ కళాశాల సుదర్శన్ ఆడిటోరియంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురు పురస్కారం అందజేయటం అభినందనీయమన్నారు. ఈ అవార్డును ఆయనకు అందించడం ఉపాధ్యాయులకు అందిన గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా వివిన్ ప్రసాద్ ఇండియన్ స్పేస్ ఆర్గనైజర్ డాక్టర్ కే రామ్మోహన్‌రావు, నిర్వాహకులు చివుకుల సాంబశివ రావు, వేణుగోపాల్, విశిష్టత చెరువు రామకృష్ణ మూర్తి పాల్గొన్నారు. అభినందించిన వారిలో మండల విద్యాశాఖ అధికారి పులి లాజర్,టి నవీన్ కుమార్ , కాటూరు నాగేశ్వరరావు, నాగిశెట్టి వీరబ్రహ్మేంద్ర ఉన్నారు.

## మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ సైనిక సంక్షేమం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సైనికులు సర్వ మతాలను గౌరవించుకునే పట్టణం విజయలక్ష్మీపురంలోని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబ శివరావు నేతృత్వంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వ హించారు. బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆదిశేషరెడ్డి, సెక్రటరీ సయ్యద్ అఖిల్, కోశాధికారి పువ్వాడ యల్లమంద, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేష గిరిరావు, సీనియర్ మాజీ సైనికులు నలాడి దాసు, మహిళా సభ్యురాలు రాఘవాదేవి, అబ్దుల్ రజాక్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీనివాసరావు, వేణు, ధర్మా రెడ్డి, ఆడే కిషోర్, రాంప్రసాద్ రెడ్డి, శ్రీనివాసరావు, తేజ పాల్గొన్నారు.

# దేవాంగుల సంక్షేమానికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : దేవాంగ సామాజిక వర్గ సంక్షేమానికి కృషి చేస్తానని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం తృతీయ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి నుంచి దేవాంగులు తెలుగు దేశం పార్టీకి అండగా నిలిచి ఉన్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దేవాంగ సామాజిక వర్గ నేతలతో సమావేశం అయ్యారు.

ఈ కార్యక్రమంలో సిద్ధి వేంకట బుచ్చేశ్వరరావు, పృథ్వీ లలిత మోహన్, నాసిక శివాజి, బాపట్ల జిల్లా దేవాంగ నాయకులు, చీరాల, వేటపాలెం మండలాల నాయకులు, తెలుగు దేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.